సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,29 జనవరి 2025


# వాహనదారులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



**- హైవే పిడి సురేంద్ర నాథ్**

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** వాహనదారులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అనారోగ్యం ఏర్పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, అనారోగ్యంతో వాహనాలు నడపరాదని ఎన్‌హెచ్ పిడి సురేంద్రనాథ్ పేర్కొన్నారు. రావులపాలెం ఈతకోట టోల్ ప్లాజా వద్ద 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలులో భాగంగా టోల్ ప్లాజా వద్ద రాజమండ్రి వేద హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రాజెక్ట్ మేనేజర్ కే.బాల సుబ్రమణ్యం, టోల్ మేనేజర్ కర్రీ వీర వెంకట సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. రాజమండ్రి వేద హాస్పిటల్ వైద్యులు తేజో ఫణింద్ర (ఆర్థోపెడిక్ & స్పైన్ స్పెషలిస్ట్ ), డాక్టర్ లక్ష్మి మృదుల (గైనిక్ స్పెషలిస్ట్) పలువురు వాహనదారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 108 మంది వాహనదారులకు, రోడ్ వినియోగదారులకు, స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డీ సురేంద్రనాథ్, టెక్నికల్ మేనేజర్ అన్సారీ, టీం లీడర్ ఏ.శ్రీనివాసరావు, క్యాషియర్ సురేష్, ఐఎమ్ మేనేజర్ ప్రవీణ్, హెచ్ఆర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రిలకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రంపచోడవరం మండలంలోని కె.ఎర్రంపాలెం గ్రామంలోని గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను, పోక్స్‌పేట గ్రామ సచివాలయం, నరసాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పరిశీలించడం జరిగింది. ముందుగా నర్సాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది వైద్యాధికారులు ఉన్నది, ఎంతమంది సిబ్బంది ఉన్నది, ప్రతిరోజు ఎంతమంది రోగులు ఈ ఆసుపత్రికి వస్తున్నారు ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి అదేవిధంగా రక్త పరీక్షలు చేసి ఆయా వ్యాధులకు మందులు అందజేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణీ స్త్రీలకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రక్తహీనత లేకుండా ఉచిత మందులు అందజేయాలని, అదేవిధంగా నెలలు నిండిన గర్భిణీ



స్త్రీలను బర్త్ వెయిటింగ్ హాలుకు, రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి డెలివర్లకు తీసుకురావాలన్నారు. అదేవిధంగా. కె.ఎర్రంపాలెం గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ బాలికల పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్రతిరోజు మెనూ అమలు చేయాలని అదేవిధంగా ప్రతిరోజు ఎప్పటికప్పుడు వేడివేడిగా తయారుచేసిన ఆహారం పెట్టాలని ఆయన అన్నారు. విద్యార్థులకు ప్రతిరోజు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలని అదేవిధంగా విద్యార్థులు ఎవరికైనా అనారోగ్యంగా



ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు తీసుకొని వెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం పోక్స్ పేట గ్రామ సచివాలయాన్ని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. సచివాలయంలో ఎంతమంది సిబ్బంది ఉన్నది ఏ పనులు ప్రతిరోజు నిర్వహించుచున్నది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీయడం జరిగింది. అదేవిధంగా దస్త్రాలు పరిశీలించడం జరిగింది. పోక్స్ పేట గ్రామ రెవెన్యూ అధికారి జమున విధులకు గైర్హాజరు అయినందున ప్రాజెక్ట్ అధికారి ఆగ్రహం వ్యక్తం చేసి, విధులు నుండి సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

**- తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో**
**ప్రతి మంగళవారం నిర్విరామంగా జగ్గంపేట సెంటర్లో నిర్వహణ**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో పాత పోలీస్ స్టేషన్ వద్ద ప్రతీ మంగళవారం జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ ను నిర్వహిస్తున్నారు. ఈ డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా 400 మంది భోజనాలు స్వీకరించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో గత ఎన్నికల అనంతరం నుండి ఈ డొక్కా సీతమ్మ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాజనాల శ్రీను,సూరపురెడ్డి నరేష్,మాదారపు వీరబాబు, అంకం ఓం ,గంధం శ్రీనివాస్, సత్తి సోమరాజు,రాపెటీ చిట్టిబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## శిరస్త్రాణం ధరించాలి

**- జిల్లా ఎస్పీ బిందు మాధవ్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** వాహనదారులు ప్రయాణ సమయంలో శిరస్త్రాణం (హెల్మెట్) తప్పనిసరిగా ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలని కాకినాడ జిల్లా ఎస్పీ గరికిపాటి బిందు మాధవ్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్పీ బిందు మాధవ్ హెల్మెట్ ర్యాలీని జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించి స్వయంగా వాహనం నడిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉండడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చుని, హెల్మెట్ యొక్క ఆవశ్యకత తెలియజేశారు. ఈ ర్యాలీ జిల్లా కార్యాలయం నుండి ప్రారంభమై భానుగుడి జంక్షన్, మెయిన్ రోడ్డు మీదుగా మసీద్ సెంటర్, బాలాజీ చెరువు సెంటర్, జెడ్పి జంక్షన్, నూకాలమ్మ తల్లి గుడి, భానుగుడి జంక్షన్ నుండి జిల్లా కార్యాలయమునకు చేరుకుంది. ఈ ర్యాలీలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జిల్లా ట్రాన్స్పోర్ట్ కమిషనర్ శ్రీధర్ ఒకే వాహనంపై హెల్మెట్ ధరించి ప్రయాణించారు. ఈ ర్యాలీలో కాకినాడ ఎస్డిపిఓ మనీష్ దేవరాజ్ పాటిల్ పాల్గొన్నారు. ఈ ర్యాలీకి ట్రాఫిక్ 1 ఇన్స్పెక్టర్ ఎన్.రమేష్, ట్రాఫిక్ 2 ఇన్స్పెక్టర్ రామారావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ హరినాథ్ సారధ్యం వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాంతి భద్రతల సిబ్బంది, పోలీస్ ట్రాఫిక్ సిబ్బంది, ఎన్హెచ్ఎఐ సిబ్బంది, మహిళా రక్షక్, డాక్టర్లు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు, ద్విచక్ర వాహనదారులు సుమారు 400 మంది వరకు ర్యాలీలో పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో

### భాగంగా జియోలాజికల్ మార్వెల్స్ సందర్శన



గండేపల్లి, మేజర్ న్యూస్ : ఆదిత్య విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం విద్యార్థులు డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ మార్గదర్శకత్వంలో జియోలాజికల్ ఫీల్డ్ ట్రిప్‌ను ప్రారంభించినట్లు విభాగాధిపతి డా. బి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలోని ముఖ్యమైన భౌగోళిక నిర్మాణాలను అన్వేషించడంపై ఈ పర్యటన దృష్టి సారించింది. విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతం రామేశంపేట లోని లేటరైట్ నిక్షేపాలు సందర్శించారు, అక్కడ వారు లేటరైట్ ఏర్పడటానికి దారితీసే భూగర్భ ప్రక్రియలు మరియు దాని ఇంజనీరింగ్ ప్రాముఖ్యత అధ్యయనం చేశారు. వారు గౌరీపట్నం లో బసాల్ట్ మరియు సున్నపురాయి నిర్మాణాలను కూడా సందర్శించారు. ఈ పదార్థాల భౌగోళిక లక్షణాలు మరియు పారిశ్రామిక ప్రాముఖ్యతపై వారి అవగాహనను విస్తృతం చేశారు. ఈ విద్యా యాత్ర విద్యార్థులకు తరగతి గది అభ్యాసాన్ని వాస్తవ-ప్రపంచ భౌగోళిక నిర్మాణాలతో అనుసంధానించడానికి విలువైన అవకాశాన్ని అందిస్తుందని, విద్యార్థులకు ఈ రంగంలో వారి జ్ఞానాన్ని మెరుగుపరుస్తుంది అని డా. రామ్మోహన్ రెడ్డి అన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ తన విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్పోజర్ మరియు సంపూర్ణ అభ్యాసాన్ని నిర్ధారించడానికి తన పాఠ్యాంశాల్లో కీలకమైన భాగంగా ఇటువంటి క్షేత్ర సందర్శనకి ప్రాధాన్యతనిస్తూ ఉంది. ఈ కార్యక్రమానికి ప్రో. శివకుమార్, డా. సుమన్ కుమార్ కో.ఆర్డినేటర్ లుగా వ్యవహరించి విద్యార్థులకు చక్కని దిశానిర్దేశం చేశారు.

## రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం



**అల్లవరం, మేజర్ న్యూస్ :** స్థానిక రవితేజ జూనియర్ కాలేజీ నందు రోడ్ సేఫ్టీ , మత్తు పదార్థాల దుష్ప్రభావాలు మరియు సైబర్ నేరాల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమలాపురం రూరల్ సిఐ ప్రశాంత్ కుమార్ మరియు అల్లవరం ఎస్సై హరీష్ కుమార్ పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని, రాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రలోభాలకు గురిచేసే ప్రకటనలకు మోసపోవద్దన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన

**- నగరంలోని పలు ప్రాంతాల్లో**
**పర్యటించిన నగరపాలక సంస్థ కమిషనర్ భావన**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ.. కాకినాడ నగరపాలక కమిషనర్ భావన ఐఏఎస్ మంగళవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా నగరంలోని గాంధీనగర్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా ఆదిత్య విద్యార్థినుల బైక్ ర్యాలీ





**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లో నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విద్యార్థినులు మంగళవారం రోడ్డు రవాణా సంస్థ మరియు సెట్‌రాజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'బైక్ ర్యాలీ'లో విధిగా హెల్మెట్ ధరించాలి అనే నినాధంతో విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు స్పందిస్తూ మీ భద్రత మరియు ఇతరుల భద్రత కోసం ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ప్రతి పౌరుడు రహదారి భద్రత అవశ్యకతను తెలుసుకోవాలి. డ్రైవింగ్ పై పూర్తి అవగాహన కలిగినప్పుడు మరియు డ్రైవింగ్ లైసెన్స్ వున్నవారు మాత్రమే రోడ్లపై వాహనాలను నడిపి పోలిసువారికి సహకరించాలని అన్నారు. డ్రైవింగ్ చేస్తున్నపుడు హెల్మెట్ తప్పనిసరి అని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ రహదారి భద్రతా వారోత్సవాలలో పాల్గొన్న ఎన్. ఎస్.ఎస్. వాలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ వి.బిందుమాధవ్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ కె.శ్రీధర్ మరియు సి.ఇ.ఒ ఆఫ్ సెట్‌రాజ్ కె.వి.యస్. విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ 'బైక్ ర్యాలీ' లో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్. ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖ దేవి, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మాన్ని కాపాడటమే లక్ష్యం

**- దేవాదాయ ధర్మాదాయశాఖ నూతన కమిషనర్ రామచంద్ర మోహన్**
**- ఘనంగా అభినందించిన అన్నవరం వ్రత పురోహితుల సంఘం పెద్దలు**



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన కె.రామచంద్ర మోహన్‌కి అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘం నాయకులు అభినందనలు తెలియజేయడం జరిగింది. మంగళవారం విజయవాడ సమీపంలోని గొల్లపూడి కమిషనర్ కార్యాలయంలో ఆయనను కలిసి ఘనంగా అభినందించడం జరిగింది. ఈసందర్భంగా దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ అన్నవరం దేవస్థానం కార్యక్రమాలు, అభివృద్ధి తదితర విషయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హిందూ ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా దైవచింతనలో పనిచేయాలని కమిషనర్ రామచంద్ర మోహన్ ఈ సందర్భంగా వ్రత పురోహితలకు సూచించారు. నూతన కమిషనర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించినందుకు ఎంతో ఆనందంగా ఉందని అభినందించారు.

ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్రత పురోహితులు మంగళంపల్లి కృష్ణ భగవాన్ జీ, వ్రతపురోహిత సంఘం తరపున నాగాభట్ల రవిశర్మ,కర్రి నాని, మహేంద్ర వాడ జగదీష్, ద్విభాష్యం సత్యనారాయణ, తాతపూడి మణికంఠ, రాయప్రోలు పెద్ద, సవితాల వీరబాబు, నాగాభట్ల శంకర్, పెండ్యాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

**- కౌడా చైర్మన్ తుమ్మల బాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మంగళవారం స్థానిక కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సమావేశ మందిరంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌తో సమీక్ష సమావేశం చైర్మన్ నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి అనుమతులు సాధ్యమైన త్వరగా మంజూరు చేసేలా తాను కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. కౌడా నూతన మాస్టర్ ప్లాన్ అమలుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని త్వరలోనే అమల్లోకి మాస్టర్ ప్లాన్ రావడం జరుగుతుందని తెలిపారు. కౌడా పరిధిలో లేఔట్లు, ప్లాట్లు, బిల్డింగ్ ప్లాన్స్ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి సత్వరం అనుమతులు ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. సమావేశంలో మాస్టర్ ప్లాన్ పూర్తి చేయడం గురించి ఎంఐజి లేఔట్స్ కొత్త లేఔట్లు సవరణ ప్రభుత్వ జీవోలు అనుమతులు గురించి చర్చించారు. ఈ సమావేశంలో కౌడా ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, కృష్ణారావు, వెంకట్రావు, శివరామకృష్ణ, సెక్రటరీ కాళీ బాబు, రాష్ట్ర ఎల్‌టిపి అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాంబాబు, క్రెడాయ్ కాకినాడ చాప్టర్ ప్రెసిడెంట్ కమ్ముల విజయ్ కృష్ణ, కాకినాడ జిల్లా ఎల్‌పిటి సభ్యులు, నేరెడ్కో కాకినాడ ప్రెసిడెంట్ పి.వి.గోపాలరావు, వేణు, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని లైసెన్స్ టెక్నికల్ పర్సన్ ప్రముఖ స్ట్రక్చరల్ ఇంజనీర్లు, కౌడా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
బుధవారం,
29 జనవరి 2025


## కిషోర్ వికాసంలో కరాటే సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఆలమూరులో మండల ప్రజాపరిషత్తు కార్యాలయం నందు సిడిపిఓ గజలక్ష్మి నేతృత్వంలో ఏర్పాటుచేసిన కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా శిక్షణా తరగతులు అనంతరం మాస్టర్ టీ.అబ్బులు ఆధ్వర్యంలో అంగనవాడి కార్యకర్తలు,హెల్త్ డిపార్ట్మెంట్ ఏఎన్ఎం, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్పించారు.ఈ సందర్భంగా సిడిపిఓ గజలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను ఎదుర్కోవాలంటే ఈ కరాటే మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని, చిన్ననాటి నుండి నేర్చుకోవడం వల్ల సమాజంలో ధైర్యంగా ముందుకు సాగవచ్చు అన్నారు.అత్యాచార, నేరాలనుండి అత్యవసర పరిస్థితుల్లో ఈ యొక్క టెక్నిక్స్ ఉపయోగపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ టి.ఎన్.వి లక్ష్మి, వై.అరుంధతి, ఫాతిమా,కరాటే మాస్టర్ ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## స్కేటింగ్ రజిత పతక విజేతకు జిల్లా కలెక్టర్ అభినందనలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మైసూర్లో 2024 డిసెంబర్ 10 తేదిన జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో రజిత పతక విజేత అయిన తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ నివాసి అరదాడి మహీధర రాజ్‌కుమార్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తమ ఛాంబర్‌లో రజిత పతకంతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రాజ్‌కుమార్ జాతీయ స్థాయిలో మరింతగా రాణించాలని ఆశీర్వదించారు. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని కలెక్టర్ తెలియ జేశారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి బి.శ్రీనివాసరావు, తూరంగి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, విజేత తండ్రి అరదాడి సత్తిబాబు, అల్లూరి సీతారామరాజు కాలనీ నివాసి చింతపల్లి అజయ్ కుమార్, కురుపూడి వీరబాబు విజేత రాజ్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.

# 76 సంవత్సరాల తర్వాత మావోయిస్టు ఇలాకాలో ఎగిరిన జాతీయ జెండా

### – డిఐజి సూరజ్ పాల్ వర్మ

**చింతూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర సరిహద్దు రాష్ట్రమైన చత్తీస్గడ్ రాష్ట్రంలోని మారుమాల ప్రభావిత ప్రాంతాల్లో రిపబ్లిక్ డే సందర్భంగా మూడు రంగుల జెండాను 76 సంవత్సరాల తర్వాత ఎగురవేసినట్లు సిఆర్పిఎఫ్ కుంట డిఐజి సూరజ్ పాల్ వర్మ తెలిపారు. ఓపిఎస్ రేంజ్ కొంటా 76వ గణతంత్ర దినోత్సవం జరుపుకుందని, అంతర్గత భద్రతను పరిరక్షించడంలో అగ్రగామిగా, నాయకత్వం వహిస్తున్న సిఆర్పిఎఫ్ 76వ గణతంత్ర దినోత్సవాన్ని 26 జనవరి-2025న దేశమంతటా జరుపుకుందని . దీనిలో భాగంగా మావోయిస్టుల ముప్పుతో పోరాడేందుకు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో కొంట, మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మోహరించిన సిఆర్పిఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా, కుంట రేంజ్ డిఐజి (ఆప్స్) సూరజ్ పాల్ వర్మ, కొంటలో జాతీయ జెండాను ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ సీనియర్ అధికారులు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సివిల్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ చారిత్రాత్మక సంఘటన దేశం సార్వభౌమాధికారం,



స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవించేలా పరివర్తనకు ప్రతీకగా డిఐజి సూరజ్ పాల్ వర్మ ప్రసంగిస్తూ నక్సల్స్ బారి నుండి స్థానికులను విముక్తి చేయడానికి, మావోయిస్టుల కోటలో మౌలిక సదుపాయాలను నిర్మించడంలో పోలీసు బలగాలు, ప్రత్యేకించి సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ అందించిన కృషి అపారమైన త్యాగాన్ని ఆయన గుర్తు చేసారు. నక్సల్స్ హింసను విడనాడి జన స్రవంతిలో చేరాలని, గిరిజన ప్రాంతంలో అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు.



కేంద్ర హోంమంత్రి దార్శనికత ప్రకారం మార్చి-2026 చివరి నాటికి సుక్మా జిల్లాతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల నిర్మూలనకు మరింతగా కృషి చేయాలని సిఆర్పిఎఫ్, పోలీసు సిబ్బందిని కూడా ఆయన ప్రోత్సహించారు. డిఐజి సూరజ్ పాల్ వర్మ, కుంటలోని పాఠశాల విద్యార్థులకు, అనాథ శరణాలయాలకు మిఠాయిలు, అవసరమైన వస్తువులను పంపిణీ చేయడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## కట్టమూరులో రైతు సదస్సు

### – పాల్గొన్న శాస్త్రవేత్తలు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, కట్టమూరు గ్రామంలో మంగళవారం పామాయిల్ తోట నందు పార్వతీపురానికి చెందిన ఉద్యాన కళాశాల బి.ఎస్సీ హార్టికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉద్యాన పరిశోధన స్థానం మరియు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉద్యాన పంట సాగులో మెళకువలు, నూతన పద్ధతులుపై తెలిపారు. సేంద్రియ సాగు ఆవశ్యకతపై నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.ఆర్.రాజ్యలక్ష్మి, పెద్దాపురం పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి డా.పి.సునీత, ఉద్యాన శాఖ అధికారి ఎన్.సుజాత, ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎం.జానకి, డీన్ రిప్రజెంటేటివ్ డా.బి.హరిరామ్, రైతులు, ఉద్యాన, వ్యవసాయ సహాయకులు సిహెచ్.విజయదుర్గ, కె.అమృతవర్షిణి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పరిశీలించిన వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో వివిధ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి తండ్రి సీనియర్ రాజకీయ నాయకుడు వాసంశెట్టి సత్యం మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా నాలుగో వార్డ్‌లో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించి నాణ్యమైన మెటీరియల్ వాడుతున్నారా లేదా అని స్వయంగా తనిఖీ చేసి కాంట్రాక్టర్‌ని అడిగి తెలుసుకుని నాణ్యమైన మెటీరియల్ నే వాడాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని వాసంశెట్టి సత్యం కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కంచుమర్తి బాబురావు, జనసేన నాయకులు నారపరెడ్డి బలరాం మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపి పిల్లి సుభాష్ చంద్ర బోస్



రామచంద్రపురం, మేజర్ న్యూస్ : రామచంద్రపురం మండలం కందులపాలెం గ్రామం శివారు గొల్లలచెరువులో ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ నిధులతో డైనేజి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ లేక నీరు నిల్వ ఉండడం వల్ల స్థానికుల ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామ పెద్దలు, స్థానిక యువ నాయకులు వైట్ల హరికిషన్‌ని సంప్రదించి తెలియజేయగా, సేవాభావంతో హరికిషన్ విషయాన్ని ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిర్మాణ పనులను చేపట్టాలని ఎంపి బోస్ 20 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగింది అని వెల్లడిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రామచంద్రాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పిల్లి సూర్య ప్రకాష్, కందులపాలెం యువ నాయకులు వైట్ల హరికృష్ణ, రామచంద్రాపురం మున్సిపల్ ఛైర్పర్సన్ గాథంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, జడ్పీటీసీ మేర్నీడీ వేంకటేశ్వరరావు, ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి శ్రీనివాస్, సర్పంచ్ పెంకే కృష్ణ వేణి, ఉప సర్పంచ్ వెంటపల్లి రామకృష్ణ, వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు, వైట్ల హరికిషన్ ఫాలోవర్స్, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి - సీఐటీయూ



చింతూరు, మేజర్ న్యూస్ : ఏపీ వెలుగు వివోఏ ల యానిమేటర్స్ ఉద్యోగాల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చింతూరు డివిజన్ పరిధిలో విఆర్ పురం, కూనవరం, చింతూరు, ఎటపాక వివోఏ ల సమస్యలు పరిష్కరించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, ఈ నెల 27, 28 తేదీలలో చింతూరు ఐటీడీఏ ముందు సిఐటియూ ఆధ్వర్యంలో సామూహిక దీక్షను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 నెలల నుండి బకాయి వేతనాలు చెల్లించాలని, వివోఏ ల ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ను రద్దు చేయాలని,. రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది వివోఏలు పొదుపు సంఘం మహిళలకు దీర్ఘకాలంగా సేవలందిస్తున్నారని, గత వైసిపి ప్రభుత్వం మూడు సంవత్సరాలు పనిచేసిన వివోఏ లను తొలగించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని 2019 నవంబర్ నెలలో సర్క్యులర్ను జారీ చేశారు. నాటి నుండి నేటి వరకు కాలపరమితి సర్క్యులరు రద్దు కోసం, ఉద్యోగ భద్రత కోసం, హెచ్ ఆర్ పాలసీ అమలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, జండర్ పేరుతో తొలగింపులు ఆపాలని అన్నారు. కూటమి ప్రభుత్వం విఓఎల కాల పరిమితి సర్క్యులర్ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, సర్క్యులరును రద్దుచేసి వివోఏల ఉపాధిని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, పిఎన్ఎం మండల నాయకులు పట్రా రమేష్, వివోఏ ల నాలుగు మండలాల నాయకులు గొర్రె లక్ష్మయ్య, రత్తయ్య, దూలమ్మ, రత్నకుమారి, లీలావతి, దుర్గాదేవి, అనసూయ, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1న సీఎం చంద్రబాబు పర్యటన



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి ఒకటవ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా గృహ ప్రవేశం కార్యక్రమం, ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు, ఆ మేరకు క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన చెయ్యడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం కొవ్వూరు మండలంలో స్పీక్ గృహ సముదాయాల లే అవుట్, దొమ్మేరు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు, ఎస్పీ డి.నరసింహ కిషోర్, జేసీ ఎస్. చిన్న రాముడు హౌసింగ్ ఇంచార్జి పి డి కే. భాస్కర్ రావు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తదితరులు తో కలిసి పర్యటించారు.అనంతరం కొవ్వూరు, దొమ్మేరు తదితర ప్రాంతాల్లో ఏపి హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.రాజబాబు పర్యటించడం జరిగింది. ముఖ్యమంత్రి సభ ఏర్పాట్ల కు సంబంధించి పూర్తి వివరాలు ఖరారు చేసి వెల్లడించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## జొన్నాడలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం



ఆలమూరు, మేజర్‌న్యూస్ : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని జొన్నాడ గ్రామంలో మంగళవారం మండల అధ్యక్షులు నాగిరెడ్డి స్వామి అధ్యక్షతన కొవ్వూరి సీతారామ రెడ్డి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది.ముఖ్య అతిథిగా బిజెపి కొత్తపేట నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ పాల్గొన్నారు.

ముందుగా వారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేద్కర్ అని, రాజ్యాంగం రచించడంలో కీలక పాత్ర పోషించారన్నారు.ప్రతీ వ్యక్తి ఆయనను ఆదర్శంగా తీసుకుని రాజ్యాంగానికి కల్పించిన హక్కులను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు చింతలపూడి శ్రీనివాస్, కట్టా ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షులు గంగిరెడ్డి,సత్యనారాయణ రెడ్డి,గంటా మనోహర్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

# బాల బాలికల అభివృద్ధి, రక్షణ ప్రభుత్వ లక్ష్యం..



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** కిశోరి బాలికల అభివృద్ధి, రక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కే. విజయకుమారి అన్నారు సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ (ఐసిడియస్) ప్రాజెక్ట్ పెద్దాపురం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సిడిపివో ఉషా అధ్యక్షతన మంగళవారం సామర్లకోట అర్బన్ పరిధిలోని అధికారులకు, కిషోరి వికాసం ప్రోగ్రామ్‌పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కే విజయకుమారి మాట్లడుతూ బాలల పరిరక్షణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. కిశోరీ వికాసం ద్వారా వార్డు స్థాయిలో గ్రూపు లు ఏర్పాటు చేసి, వారికి బాలలు చట్టాలు, పరిరక్షణ అంశాలు, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. గౌరవ అతిథి మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ కిశోరి వికాసంకు సంబంధించిన అనేక విషయాలపై సూచనలు చేశారు. ఈ శిక్షణలో సిడిపిఓ ఉష మాట్లాడుతూ నేటి సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్ర రూపం దాల్చిందని బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు ఎక్కువవు తున్నాయని బాలలను కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దీనిలో భాగంగా కిశోరి బాలికా వికాసం కార్యక్రమంపై వార్డు కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది,మహిళాకార్యదర్శులు, విద్యాశాఖ, ఎఎన్ఎం లు, పాఠశాల ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు నిర్వహించిన అవగాహనా కల్పించారు. యుక్త వయస్సులో ఋతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యం, జీవనోపాది పై గ్రామస్థాయిలోని యుక్త వయసు బాల బాలికలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా గ్రామస్థాయిలో 11-18 సంవత్సరాల వయసు గల బాల బాలికలను రెండు రకాలుగా గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి ఈ అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు సిడిపివో చెప్పారు. కిశోరి ఆరోగ్యం, ఆహారం విషయమై అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డా. ప్రభ మాట్లాడారు. భీమవరపు కుమారి, క్రాఫ్ట్ ఎన్ జీవో భీమవరపు కుమారి, సిఐ కృష్ణ భగవాన్, ఎంఈఓలు వై శివ రామ కృష్ణయ్య, పి పుల్లయ్య జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సి హెచ్ వెంకటరావు కిశోరి వికాసం పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అదేవిధం గా బాల్యవివాహ నిర్మూలనా చట్టం వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పివో కె శ్రీనివాస్ రావు , నిక్ పివో కె విజయ, చైల్డ్ హెల్ప్లైన్ కో ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, అంగన్వాడీ సుపర్వైజర్లు ఎ.మంగ మహమ్మద్ సుల్తాన్ బీబీ, నిర్మల కుమారి, జి వీరలక్ష్మి, ఐసిడియస్ కార్యాలయ సిబ్బంది ఎన్ నాగేంద్ర, కె అప్పారావు ఐసిడిఎస్ విస్తరణాధికారులు, రెవిన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్సులు, అంగన్వాడీ కార్యకర్తలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరంతర విద్యుత్ కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

### – ఏఈ డేవిడ్ నిచ్చల్



**పెరవలి, మేజర్ న్యూస్ :** రానున్న వేసవికాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 24/7 నిరంతర విద్యుత్ ఇవ్వడానికి ఇప్పటినుండి తగిన ఏర్పాటు చేస్తున్నామని పెరవలి ఎలక్ట్రికల్ ఏఈ డేవిడ్ నిచ్చల్ అన్నారు. జనవరి 28వ తేదీ మంగళవారం మేజర్ న్యూస్‌తో మాట్లాడుతూతూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం పెరవలి విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో ముక్కామల గ్రామంలో విద్యుత్ శాఖ వారు ఆర్డిడిఎస్ విద్యుత్ పథకంలో భాగంగా గ్రామంలో నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నామని మండల విద్యుత్ అధికారి ఎం డేవిడ్ నిచ్చల్ తెలిపారు. రానున్న వేసవి దృశ్య పల్లె పల్లెకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని రానున్న రోజుల్లో లోవోల్టేజ్ సమస్యను పూర్తిగా తొలగించాలని కృషి చేస్తున్నట్టు ఏఈ నిచ్చల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ చిన్నారావు, స్థానిక లైన్మెన్ల బి ప్రదీప్ కుమార్, ఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఏఈ ఎలక్ట్రికల్‌గా కలెక్టర్ ప్రశంసపత్రం పొందిన డేవిడ్ నిచ్చల్

### – శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించిన విద్యుత్ ఉద్యోగులు



**పెరవలి, మేజర్ న్యూస్ :** విద్యుత్ శాఖ ఏఈగా పని చేయుచున్న డేవిడ్ నిచ్చల్ రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదగా ఉత్తమ ఏఈ ఎలక్ట్రికల్‌గా అవార్డు పొందారు.

పెరవలి విద్యుత్ శాఖ ఏఈగా విధులు నిర్వహిస్తున్న డేవిడ్ నిచ్చల్‌కు ఈ అవార్డు రావడంతో జనవరి 28 వ తేదీ మంగళవారం ఏఈ డేవిడ్ నిచ్చల్ ను పెరవలి మండలానికి చెందిన అన్ని గ్రామాల లైన్మెన్లు విద్యుత్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండల విద్యుత్ శాఖ సిబ్బంది అన్ని గ్రామాలు చెందిన లైన్మెన్లు లైన్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం - ఎమ్మెల్సీఅనంత బాబు



రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్: కార్య కర్తలే పార్టీకి బలమని ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాజావొమ్మంగిలో పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి లు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశ కం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో ప్రజలు రెండు దపాలు వైసిపి పార్టీకి పట్టం కట్టడం జరిగింద న్నారు. 2014, 2019 లో వైసిపి కి కార్యకర్తలు లేరనిబలగం, ఆర్థిక వనరులు కూడా లేవని అందరం ప్రతి గ్రామం తిరిగి పార్టీని బలోపతం చేయడం జరిగిందన్నారు. మన ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా పని చేయడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రతి వ్యక్తికి, అన్ని వర్గాలకుమేలు జరిగిందన్నారు. నేటి ప్రభుత్వం హామీలను గాలికి వదిలేశారని ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. మనం ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రతి ఇంటికి గడప గడపకు తిరిగి ఓట్లు అభ్యర్థించామని కానీ టిడిపి లో ప్రస్తుత ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వడం కొందరు నాయకులకు రుచించక ఇంటికే పరిమితమయ్యారని నియోజకవర్గంలో టిడిపి నాయకులు ఓట్లు అడిగిన దాకలాలు లేవని అలాంటిది ఇక్కడ టిడిపి విజయం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని వైసిపి పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ అనంతబాబు హెచ్చరించారు. రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి కరువైందని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, వైసిపిప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

## పిఠాపురం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం:300/2024/ఇ1 తేది. 28.01.2025

**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు నోటీసు**

పిఠాపురం పురపాలక సంఘం సాధారణ నిధుల నుండి 'పిఠాపురం పురపాలక సంఘమునకు సంబంధించిన LED వీధి దీపముల నిర్వహణ మరియు వాటర్ వర్క్స్ నందు మోటార్ ఏర్పాటుకు' 2 పనులకు గాను అంచనా రూ.5.77 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా ఈ క్రింది తెలిపిన సైట్‌లలో టెండర్లు కోరబడుచున్నవి.

**బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడ్ ప్రారంభ తేది :**
29-01-2025 సాయంత్రం గం.5.00ల నుండి.

**బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడ్ ఆఖరు తేది :**
31-01-2025 సాయంత్రం గం.4.30ల వరకు.

మిగిలిన వివరములు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఇతర వివరముల కొరకు సెల్ నెం. 9849906523 ద్వారా తెలుసుకొనవచ్చును.

సం./- నామ కనకారావు
కమిషనరు,
పిఠాపురం పురపాలక సంఘం

## విజిబుల్ పోలీసింగ్‌తో ఆకతాయిలకు చెక్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో... పిఠాపురం పట్టణ ఎస్ఐ వి. మణికుమార్, అదనపు ఎస్సై జానీ బాషా వారి సిబ్బందితో కలిసి పిఠాపురం స్థానిక ఆర్ఆర్ బి హెచ్ ఆర్ జూనియర్ కాలేజ్ వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వాహన తనిఖీలు నిర్వహించి, మద్యం సేవించి వాహనం నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) మరి యు సరియైన పత్రాలు లేనటువంటి వాహనాలని సీజ్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కళాశాలలు, పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో... ఈవ్ టీజింగ్ జరగకుండా ప్రతి స్కూలు, కాలేజీల వద్ద పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగినది, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా... వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పిఠాపురం పట్టణ ఎస్ ఐ వి. మణికుమార్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

## ఘనంగా శ్రీ దుర్గా రావులమ్మ అమ్మ వారి సంబర మహోత్సవాలు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట గ్రామంలో శ్రీ దుర్గా రావులమ్మ అమ్మ వారి సంబర మహోత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా జగ్గంపేట లో శెట్టిబలిజ పేట పెద్దలు నిర్వహించారు. ఈ సమర మహోత్సవాలు శెట్టిబలిజ పేట రామాలయం నుంచి మొదలుకొని గ్రామంలో పురవీధుల తిరుగుతూ మెయిన్ రోడ్ గుండా సాయంత్రం కి రామాలయానికి చేరుకుంటుంది. ఈ సంబరం గత 75 సంవత్సరాలు నుంచి పూర్వీకుల ఆనవాయితీగా వస్తుందని కాలనీవాసులు తెలిపారు. ఈ సంబర మహోత్సవంలో గరగ నృత్యాలు , శక్తి వేషాలు , బండ్ల పై అమ్మవారు , వెంకన్న బాబు, తదితర వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సంబర మహోత్సవంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా జగ్గంపేట రఘునాథరావు ఆధ్వర్యంలో పోలీస్ గస్తీ నిర్వహించారు.

# ద్విచక్రవాహనం నడిపే వ్యక్తులు హెల్మెట్ ధారణ తప్పనిసరి

- సుప్రీం కోర్టు హెల్మెట్ ధరించడం పై గతంలో ఒక తీర్పు ఇవ్వడం జరిగింది
- హెల్మెట్ ధారణ, లైసెన్స్, ఇన్సురెన్స్ తప్పనిసరి
- మైనర్ పిల్లలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం
- **2023లో 849 ప్రమాదాల్లో 329 మంది మరణించారు**
- **2024లో 728 ప్రమాదాలు జరిగితే 298 మరణించారు**
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** హెల్మెట్ ధరించక పోవడం వల్ల ప్రమాదానికి గురై ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ప్రతి ఒక్క ద్విచక్రవాహనం నడిపే వ్యక్తి హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత పిలుపు ఇచ్చారు. మంగళవారం ఉదయం జిల్లా రవాణా శాఖ కార్యాలయం, ఎఫ్ సి ఐ గోడౌన్ సమీపం, రాజమహేంద్రవరం వయా సెంట్రల్ జైలు , కంబాల చెరువు, ఆర్యాపురం, పేపర్ మిల్లు, గోదావరి బండ్, డిలక్స్ (శ్యామల) సెంటర్, బై పాస్ రోడ్, బస్ స్టాండ్, తిలక్ రోడ్, ఏ వి అప్పారావు రోడ్, జాతీయ రహదారి సర్వీస్ రోడ్, వయా లాలా చెరువు జంక్షన్ – ఆర్టీఓ కార్యాలయం వరకు చేపట్టిన బైక్ ర్యాలీ డిఎల్ ఎస్ ఏ కార్యదర్శి కే. ప్రకాష్ బాబు , జిల్లా రవాణా అధికారి ఎం. సురేష్ గారితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ, గౌరవ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ను అనుసరించి రాష్ట్ర హై కోర్టు వారు జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లాలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వివిధ బ్యాంకులు, రోటరీ క్లబ్, హార్లిక్స్ ఫ్యాక్టరీ, తదితర సంస్థల ద్వారా సేకరించిన 550 హెల్మెట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లా రవాణా శాఖ అధికారుల వారి ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్న క్రమంలో బైక్ ర్యాలీ నిర్వహించడం పట్ల అధికారులను అభినంది స్తున్నట్లు తెలిపారు. బైక్ నడిపి ప్రమాదాలకు గురైన వారికి సంబంధించి కేసులను పరిష్కారం కోసం పని చేయడం వలన ప్రమాదాలు సున్నితత్వం పై తమకు అవగాహన ఉందన్నారు. ప్రమాదానికి గురైన వ్యక్తులు యుక్త వయస్సులో ఉన్న వారు ఉండడం జరుగుతోందని, తలకి దెబ్బతగిలి అచేతనంగా, మంచానికే పరిమితం అయ్యే సందర్భాలు ఉన్నాయని గంధం సునీత పేర్కొన్నారు. ముఖ్యంగా యువత ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సమయంలో హెల్మెట్స్ లేకుండా ప్రయాణించడం చూస్తున్నట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో బైక్ పై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించకుండా బైక్ నడపరాదని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత పేర్కొన్నారు. బైక్ కొనే సమయంలో హెల్మెట్ కొనుగులు తప్పనిసరి చేస్తూన్నా, వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించపోవడం విచారించ తగ్గ అంశామన్నారు. 2023 లో 849 ప్రమాదాలు జరిగితే 329 మంది ప్రాణాలు కోల్పోయారని, 2024 లో 728 ప్రమాదాలు జరిగితే 298 ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మరింతగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. వాహనానికి బీమా, నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి అని, లేని పక్షంలో ప్రమాదం జరిగితే నష్టం పరిహారం వాహన యజమాని, బండి నడిపే వ్యక్తి నష్ట పరిహారం లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఆయా వ్యక్తులు ఆదాయం అనుసరించి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో రవాణా శాఖ అధికారులు, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంను పరిశీలించిన ఎంఈఓ వి.ఆర్.కె.చౌదరి



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో సమగ్ర శిక్షా ద్వారా నడపబడుతున్న భవిత కేంద్రం నందు మంగళవారం పెద్దాపురం మండల విద్యాశాఖాధికారి–2 వి.ఆర్.కె.చౌదరి ఫిజియోథెరపి పరిశీ లించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపి కేంద్రంలో ప్రతీ మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందని భవిత పిల్లల తల్లితండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ తెలిపారు. మండలంలోని శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం గల దివ్యాంగ పిల్లలకు ఈ భవిత కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే ఫిజియోథెరపి సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్ట్ వి.అపర్ణ, భవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.11.85 కోట్ల రూపాయలతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం

- రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన జనసేన నియోజకవర్గ ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజవర్గంలో గల పలు గ్రామాల పరిధిలో రూ. 11.85 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన పలు రోడ్లను పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ పంచాయతీరాజ్ శాఖ డి సిద్ధి వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఆదేశాలతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతుందని, అందులో భాగంగా... పి.రాయవరం–తాటిపర్తి రూ. 2 కోట్ల 29 లక్షలు, వెల్దుర్తి–సింహాద్రిపురం రూ1 కోటి 41 లక్షలు, వన్నెపూడి–జి ఎన్ టి 85 లక్షలు, విరవ–మంగితుర్తి 75 లక్షలు రోడ్ల పనులను పీఆర్ డీఈ సిద్ధి వెంకటేశ్వరరావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోదావరి ఈస్ట్రాన్ డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, పిఠాపురం జనసేన నాయకులు బిఎన్ రాజు మరియు ఇతర నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకి వెన్నతో పెట్టిన విద్య

– ఒమ్మి రఘురామ్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ప్రజలను ఎలా మోసం చేయాలో అన్న విషయంలో చంద్రబాబు పిహెచ్ డి చేశారని,నమ్మించి వంచించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షులు ఒమ్మి రఘురామ్ అన్నారు. ఆయన ఈరోజు మీడియా తో మాట్లాడుతూ ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇవ్వడం,ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అమలు పరిచే సమయం వచ్చినప్పుడు ఆర్థిక పరిస్థితి బాలేదని, జగన్ రాష్ట్రాన్ని అప్పులు పలు చేశాడని నిందిస్తూ, దివాళా తీసిన వాడిగా చేతులెత్తేయడం ఆయనకు పరిపాటి అన్నారు.మొన్న ఎన్నికలలో 2014 లో హామీలు తుంగలోకి తొక్కిన చంద్రబాబు ని ప్రజలు నమ్మకపోయేసరికి ఆ నమ్మించే ప్రయత్నం పవన్ కళ్యాణ్ తీసుకొని అదే పనిగా సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ పవన్ కళ్యాణ్ పథకాలు ప్రచారం చేశారని ఈరోజు అమలులో మాత్రం ఆయన చంద్రబాబు ని ప్రశ్నించడం లేదన్నారు.పవన్ కళ్యాణ్ సూపర్ సిక్స్ అమలు బాధ్యత తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. పేదలకు మేలు చేయాలి అంటే మనసుండాలని, అలాంటి మనసున్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు.ఈరోజు రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచక పాలన రాజ్యమేలుతుందని శాంతి భద్రతలు కరువడ్డాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేట్ పరం చేయడం ఇప్పటికీ జరుగుతుందని ప్యాకేజి ప్రకటించడం ఒక నాటకం అని, కాంట్రాక్టు ఉద్యగులను తొలగిస్తున్నారు అన్నారు.గెలిస్తే ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారని, సచివాలయ ఉద్యోగాలలో కోతలు విధిస్తూ జీఓలు జారీ అయ్యాయని అన్నారు. లక్షలాది వాలంటీర్లు వీధిన పడ్డారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగిన తగిన గుణపాఠం చెపుతారన్నారు. వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేకపాలన అడ్డుకుంటామన్నారు. జగన్మోహన్ రెడ్డి గారి పాలనలో అందరూ బాగున్నారని, ప్రతి గ్రామములో జగన్ పాలనకు సంబంధించిన అభివృద్ధి ఆనవాళ్లు ఉన్నాయన్నారు. చంద్రబాబు, కూటమి ప్రభుత్వం లో కూటమి నాయకుల సంపద వృద్ధి చెందుతుందని,పెంచుతున్న చార్జీలతో, పథకాల అమలు నోచుకోక ప్రజల సంపద కుంటుపడుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోతే చరిత్రహీనులుగా మిగిలి పోతారన్నారు.

## శ్రీనివాసరెడ్డి సేవలు అభినందనీయం



అనపర్తి, మేజర్ న్యూస్ : పిన్న వయసులోనే దశలోని పాత్రికేయ వృత్తి చేపట్టి మూడు దశాబ్దాలు పైగా సత్తి శ్రీనివాస రెడ్డి (ప్రభ శ్రీను) సేవలు అందించడం అభినందనీయమని అనపర్తి అయ్యప్ప స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ తేతలి త్రినాథ్ రెడ్డి ప్రశంసించారు.

బిజేయు నాయకులు సత్తి శ్రీనివాసరెడ్డి జన్మదిన సందర్భంగా మంగళవారం గొలుగూరి బాపిరాజు విద్యా సంస్థ క్రీడా మైదానంలో జిబిఆర్ వాకర్స్ క్లబ్ యోగా క్లబ్ ఆధ్వర్యంలో శ్రీనివాస రెడ్డికి జన్మదిన వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సాలువ కప్పి పుష్పమాలవేసి కేక్ కట్ చేసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. తేతల రామిరెడ్డి మంగయ్య మ్మ మహిళా వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఫ్రూట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ రెడ్డిని వృద్ధులు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఎం. ఎన్. ఆర్ విద్యాసంస్థల అధినేత మల్లిడి అనంతరెడ్డి. ఓం శక్తి సత్సంగ్ ప్రతినిధి సత్తి రామారెడ్డి. రామకృష్ణ సేవాసమితి కార్యదర్శి లెఫ్ట్ శ్రీను. అనపర్తి వర్తక సంఘం అధ్యక్షులు కొవ్వూరి వెంకటరామారెడ్డి. ఎస్ వి ఆర్ వ్యాపార సంస్థల అధినేత నారాయణరెడ్డి. వ్యాపార ప్రముఖులు కర్రీ సత్తిబాబు. పావని దొర. ఎన్.ఎస్.ఆర్ రాజా. పేపర్ మిల్లు బుజ్జి. హెచ్ఎం పులగం వెంకటరెడ్డి. జిబిఆర్ వాకర్స్. యోగ. టెన్నిస్. షటిల్ క్లబ్ సభ్యులు పాల్గొని సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యాభివృద్ధే లక్ష్యంగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు



ఆలమూరు, మేజర్ న్యూస్ : విద్యాభివృద్ధే లక్ష్యంగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మెర్ల శ్రీనివాస్ అన్నారు. ఆయన అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులు అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని జొన్నాడ గ్రామంలో ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ఏఎస్ఐ సూర్య చంద్ర, యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్ ప్రభు కుమార్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 10వ తరగతికి సంబంధించిన పబ్లిక్ పరీక్షలకు షెడ్యూల్ వచ్చేసిందని,విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని సూచించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ మెర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షలలో నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి మండలంలో మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరుతూ మండల స్థాయిలో ర్యాంకు సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీలు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడే ఏలూరులో దివ్యాంగుల కోసం జాబ్ మేళా

**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** ఏలూరులో ఈనెల 29వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు దివ్యాంగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి ఎంపీడీఓ ఆనంద్ తెలిపారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పదవ తరగతి ఇంటర్మీడియట్ చదివిన అందరికీ వర్తిస్తుందని, ఈ జాబ్ మేళా ఏలూరులో వైటిసి ప్రాంగణంలో నిర్వహిస్తున్నారని వివరించారు.పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారందరికి వర్తిస్తుందని అన్నారు. అర్హులైన వారందరూ జాబ్ మేళాను ఉపయోగిం చుకోవాలని కోరారు.

## జర్నలిస్టుల సంక్షేమము, ఐక్యతే లక్ష్యంగా ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వాహణ



కాకినాడ, మేజర్ న్యూస్ :కాకినాడ జిల్లా కేంద్రంలో జర్నలిస్ట్ లుగా పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, రిపోర్టర్లు, ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు జరుగుతుం దని, ఆ నిమిత్తం ఫిబ్రవరి 5వ తేదీన ప్రజాస్వామ్యయుతంగా సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రెస్ క్లబ్ గవర్నింగ్ బాడీ నాయకులు స్పష్టం చేశారు. 11 మంది గవర్నింగ్ బాడీ సభ్యుల సమక్షంలో మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంకు అనూహ్య స్పందన లభించింది. పలువురు సీనియర్ జర్నలిస్టులు వివిధ అంశాలపై చర్చించారు. ఈ ఎన్నికల్లో పాల్గొనే అభ్యులకు సంభందించిన విధివిధానాలను వెల్లడించారు.

ఎన్నికల అనంతరం ఏర్పడే నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీకి జర్నలిస్టుల సంక్షేమం ప్రెస్ క్లబ్ నిర్వహణ తదితర బాధ్యతలు అప్పగించడం పై స్పష్టత ఇచ్చారు. ఫిబ్రవరి 5వ తేదీతో నూతనంగా ఎన్నికయ్యే ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెస్‌క్లబ్ సభ్యుల అభ్యున్నతికి పనిచేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కమిటీ కార్యాచరణలో గవర్నింగ్ బాడీ సభ్యులు రెండేళ్లపాటు సాధారణ సభ్యులుగానే కొనసాగుతారని, ఏమైనా అవకతవకలకు, అనైతిక చర్యలకు పాల్పడితే అప్పుడు మాత్రమే గవర్నింగ్ బాడీ కలగజేసుకుంటుందని స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు, వీడియో గ్రాఫర్లు లేవనెత్తిన పలు సందేహాలు, సూచనలను గవర్నమెంట్ బాడీలో చర్చించి తదుపరి తీసుకున్న నిర్ణయాలను సభ్యులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లా కేంద్రంలోని వర్కింగ్ జర్నలిస్ట్‌లు ఐక్యంగా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటుకు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సమావేశంలో గవర్నింగ్ బాడీ సభ్యులు అంజిబాబు, దుర్గారావు, ఎస్‌టి మూర్తి, దుర్రాని, స్వాతిప్రసాద్, కృష్ణంరాజు, నవీన్, ఎల్ శ్రీనివాస్,శివన్నారాయణ రెడ్డి, సాయినాథ్, శివరామకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పలువురు సీనియర్ పాత్రికేయులు. మరియు ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నేరాల కట్టడికి సమర్ధవంతంగా పనిచేయాలి - జిల్లా ఎస్పీ



కాకినాడ, మేజర్ న్యూస్ : జిల్లాలో నేరాల కట్టడికి పోలీసు అధికారులు సమర్ధవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. జిల్లా నేర సమీక్ష సమావేశం మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఫిర్యాదులపై వేగంవంతంగా స్పందించాలన్నారు. ముఖ్య పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు బహిరంగ ప్రదేశాల్లో, అన్ని విద్యా, వైద్య, ఇతర కార్యాలయముల వద్ద ప్రదర్శించాలన్నారు.అన్ని వ్యాపార, విద్యా, వైద్య, ప్రార్ధన, బహిరంగ స్థలాల్లో విధిగా సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కనీసం 20 రోజులు డేటా నిల్వ ఉండేలా చూడాలన్నారు. కాకినాడ, పెద్దాపురం సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.మైనర్లు, మహిళల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.లాంగ్ పెండింగ్, గ్రేవ్, కేసులపై దృష్టి సారించాలన్నారు.రౌడీషీటర్లు, సస్పెక్టులు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనం కేసులపై సబ్ డివిజన్ల వారీగా పోలీసు బృందాలను ఏర్పాటు చేసి కేసులను చేధించాలన్నారు. దొంగతనం జరిగిన కేసులలో రికవరీ శాతం పెంచి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లాలో గంజాయి మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరిగితే ఉపేక్షించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. డ్రగ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించడంలో మరిన్ని చర్యలు చేపట్టాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసుస్టేషన్ల పరిధులలో రహదారి భద్రతా నియమాల బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు.ట్రాఫిక్ సూచనలను తెలిపే సైన్ బోర్డులు, వేగ నియంత్రకాలు, జిగ్ జాగ్ సూచికలు,స్టాప్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి చర్యలు తీసుకోలన్నారు. సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రస్తుతం హోల్డ్ అయినటువంటి డబ్బులను అర్హులైన బాధితులకు అందజేసే విధంగా సరియిన చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ పరిపాలన ఎం.జె.వి భాస్కరరావు, అడిషనల్ ఎస్పీ ఏఆర్ శ్రీనివాసరావు,ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, కాకినాడ ఎస్డిపిఓ మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్.డి.పి.ఓ శ్రీహరి రాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ అధికారులు,డీసీఆర్బీ,ఐటీ కోర్, సిఐలు మరియు ఎస్సైలు హాజరయ్యారు.

## డ్రోన్ సహాయంతో ప్రకృతి వ్యవసాయ విస్తరణ



**పెరవలి, మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసాయ విస్తరణ కొరకు డ్రోన్ సహాయంతో సాంకేతిక విధానంలో డ్రోన్ ద్వారా పిచికారి కార్యక్రమం చేపట్టడంజరిగింది.ఇందులో భాగంగా జనవరి 28వ తేదీమంగళవారం పెరవలి మండలంలో కాపవరం,పెరవలి ,ఉసురు మర్రు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ కషాయాలను ద్రావణాలను వరి పంటలపై106 ఎకరాలకు పిచికారి చేయించడం జరిగింది. వరి పంటలపైపురుగులు తెగులు నియంత్రణ కొరకు వ్యాప గింజల ఇంగువ కషాయాలను చాప బెల్లం ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో పిచికారీచేయించినట్లు ల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ తెలిపారు.మొదటి విడతగా మండలంలో 650 ఎకరాలలో ఈవిదంగా పిచికారీ చేసేవిదంగా ప్రణాళిక చేసినట్లు తెలిపారు. డ్రోన్స్ ద్వారా ఈకార్యక్రమం చేపట్టి నట్లు తెలిపారు.

డివిజన్ మోడల్ మేకర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వరి పంటలపై కాండం తొలిచేపురుగు రసం పీల్చే పురుగు మాగుడు మొదలగు తెగుళ్లను నియంత్రించడానికి ప్రకృతి వ్యవసాయ కషాయాలు పిచికారి చేయడం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వరి పంటలో వచ్చు తెగిళ్ళను నివారించడంలో వేప గింజలకషాయం ,చేపల బెల్లం ద్రావణం బ్రహ్మాస్త్రము, వావిలాకు కషాయాలను జీవామృతంతో కలిపి పంటలపై పిచికారి చేయడం వల్ల ఆశించిన దానికంటే అధిక దిగుబడినిపొందవచ్చని గ్రామ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రసన్న, వెంకటరమణ తెలియజేశారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం విస్తరణ కొరకు డ్రోన్ సహాయంతో కషాయాలను రైతుల్లోనికి నేరుగా తీసుకువెళ్లడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. యూనిట్ ఇంచార్జ్ సూర్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు భుజంగరావు, వెంకటకృష్ణ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ సేవలకు ప్రశంసలు



పెద్దాపురం పురపాలక సంఘంలో మున్సిపల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న
యు.జ్యోతిరాణి గార్కి
విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, అందరి మన్ననలు పొందుతూ
ఉత్తమ సేవలు అందించినందుకుగాను
గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్ గారి చేతుల మీదుగా
ఉత్తమ సేవా ప్రశంసా పురస్కారం అందుకున్న శ్రీమతి యు.జ్యోతిరాణి గార్కి
మా హృదయపూర్వక శుభాభినందనలు తెలియజేస్తూ...

డి.ఎస్.ప్రకాశరావు
మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పెద్దాపురం